# మరో ఉప్పెన

"వీణ్ణి చూస్తూంటే చాలా అసూయగా ఉందే నాకు"! తల్లిని కరుచుకొని ఒదిగి పడుకున్న కొడుకును చూస్తూ అన్నాడు వెంకటరమణ. ఆ దగ్గరితనాన్ని తాను కోల్పోయిన భావం కన్పించింది అతడి గొంతులో.

మంచాన్ని ఆనుకొని తనకు దగ్గరగా కూర్చున్న భర్త బుగ్గ మీద కొంటెగా పొడిచింది అమృత.

కొడుకు తలను నిమురుతూ "వీడు అసలు నాకు పుట్టిన వాడేనా అమృతా!" అన్నాడు వెంకటరమణ. అతడి పెదాల మీద చిరు మందహాసం.

వెంకటరమణ చెవిని ఒక గుంజు గుంజింది అమృత.

"పరాచికమా!".

"అది కాదు! ఎప్పుడూ అమ్మా అమ్మా అంటూ నీ ఊసేగాని నాన్న అంటూ ఒక వెధవ ఉన్నాడని వీడికి తెలియదే!!".

"ఒదిగి ఒదిగే కదయ్యా వీణ్ణి కన్నావు"

గాలికి కొట్టుకుంటున్న కిటికీ రెక్కలకేసి చూసింది అమృత. ఇంటి పైకప్పు పెంకుల పగుళ్ళలోంచి మెరుపులు స్పష్టంగా కనిపిస్తూంటే ఉరుముల శబ్దానికి కదిలిన చెట్టుకొమ్మల గలగలలు వింతగా విని పిస్తున్నాయి.

"నిన్నా మొన్నా లేదు. ఇప్పుడు గాలికూడా మొదలయినట్లుంది" కిటికీ తలుపులు వేయడానికి లేచాడు వెంకటరమణ.

ఆ పెంకుటిల్లు మధ్యతరగతి స్థితిగతులకు నిలువుటద్దంలా ఉంది. ఇంటి వాకిలి లేమితనానికి ప్రతీకలా కనబడుతోంది. పెళ్లలుగా రాలిపోతున్న మట్టిగోడలు, కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న వసారా వాళ్ల ఆర్థిక స్థితిగతుల్ని చెప్పకనే చెబుతున్నాయి.

ప్రేమాభిమానాలకు ప్రతీకలా ఇంటి చుట్టూ అల్లుకున్న పచ్చిక బయళ్ళు పచ్చని తివాచీలా కన్పిస్తున్నాయి. ఇంట్లోని సామాగ్రి వెంకటరమణ ఓ సాధారణ గృహస్తు అని చెబుతూంటే, వాటిని చక్కగా సర్దుకున్న విధం అమృత ఓ దొడ్డ ఇల్లాలు అని చాటుతోంది.

అది సముద్రానికి చేరువగా ఉన్న ఎదురుమొండి గ్రామం. ఆశ్చర్యంగా అక్కడ వసుధ మాత్రం ఇసుకపొరలను కాదనుకొని వంటి నిండా నల్లరేగడి కవచంతో అలరారుతోంది. ఒళ్ళంతా పచ్చదనపు పరిమళాలు. లైట్‌హౌస్, తుఫాను హెచ్చరిక కేంద్రం వంటివి ఉన్నా వాటన్నింటినీ తలదన్నుతూ ఆ ప్రాంతం మట్టివాసనలతో మనిషి మేధకి సవాలుగా నిలుస్తోంది.

భూమి రాబోయే వసంతాన్ని గాని, ఉధృతాన్ని గాని సూచించే సాంప్రదాయక పరికరమవుతోంది.

రెండు రోజుల నుంచి విపరీతంగా కురుస్తోన్న వర్షం. గోడల నిండా చెమ్మ, జోరుగా వీస్తున్న అంత గాలిలో కూడా దగ్గరలోని సముద్రపు హోరు స్పష్టంగా విన్పిస్తోంది.

నేల వాసన నెమ్మదిగా మారుతోంది.

" ఈ గాలికి కరెంటుకూడా తీసేస్తాడేమో" అమృత మాట పూర్తి కాలేదు. కరెంటు పోయింది.

' తుఫాను కాదుగదా!' వెంకటరమణ తనలో తాను గొణుక్కున్నాడు.

ఆ చీకటిలోనే అమృతకు దగ్గరగా వచ్చాడు.

" ఏమిటిదీ!" పిల్లవాణ్ణి తననుండి విడదీస్తుంటే అంది అమృత.

పెదిమలకు దగ్గరగా ఉన్న అమృత బుగ్గను ముద్దుపెట్టుకొని 'ముచ్చట" అన్నాడు.

అంతటి చలిలో భర్త పెదాల వెచ్చదనపు స్పర్శ అమృతను మరింక వారించ నివ్వలేదు.

పిల్లవాణ్ణి పక్కమంచం మీదకు చేర్చి వెంకటరమణ అమృత పక్కన సర్దుకున్నాడు.

❖ ❖ ❖

"అన్నం తిందువుగాని రా! బాబూ" శ్రీను తల నిమురుతూ లాలనగా అంది రామసీత.

ఏడుస్తూనే అడ్డంగా తలూపాడు శ్రీను వద్దని.

"నాకు అమ్మ కావాలి....అన్నం వద్దు" అది రామకృష్ణా సేవా సదన్. ఆలనా పాలనకు నోచుకోని అనాధ బాలల ఆశ్రమం.

కనీవిని ఎరుగని ఉప్పెన సృష్టించిన ప్రళయంలో చిక్కుకుని అల్లాడిన ఎదురు మొండి గ్రామంలో కూడా మిగతా గ్రామాల్లో మాదిరిగానే సహాయక చర్యలు చేపట్టింది రామకృష్ణా సేవాసమితి.

తల్లీ తండ్రీ, అయినవాళ్లు లేకుండా మిగిలిపోయిన పిల్లలకు సమితి తమ ఆధీనంలో రక్షణ కల్పించింది.ఆ పిల్లలో శ్రీను ఒకడు. అందరిలోకి చిన్నవాడుకూడా కావడంతో అక్కడ పనిజేసే సిబ్బందికి శ్రీను అంటే ఒకింత ఎక్కువ అభిమానం, ఆయా రామసీతకైతే మరీనూ!

రామసీత శ్రీను ముఖం తుడుస్తూ,

"శ్రీను గొడవ చేయకుండా అన్నం తింటాడన్న మాట. నేను తర్వాత వాళ్ళమ్మ దగ్గరకు తీసుకెళతానన్న మాట" అంటూ బుజ్జగించడానికి ప్రయత్నిస్తోంది.

"అబద్ధం" నీళ్ళు నిండిన కళ్ళతో చూస్తూ అన్నాడు శ్రీను.

"..... ......... ...."

"రోజూ ఇలాగే చెప్తున్నావ్! అన్నీ అబద్ధాలే"

"మనం రేపు తప్పకుండా మీ ఊరు వెళదాం. మీ అమ్మను చూద్దాం" ఈసారి మాట తప్పనన్నట్లు హామీ ఇస్తూ అన్నం ముద్ద వాడి నోటి కందించింది.

అన్నట్టే శ్రీనును తీసుకొని ఎదురుమొండి వెళ్లింది రామసీత. ఉప్పెన తాలూకు ఛాయలు ఎదురుమొండిని ఇంకా వీడలేదు. రామకృష్ణ సేవా సమితి, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు ఎదురుమొండికి కొత్తరూపం ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రజల ముఖాల్లో ఉప్పెన తాలూకు విషాద ఛాయలు ఇంకా కనబడుతూనే ఉన్నాయి.

శ్రీను తమ ఇల్లును గుర్తు పట్టలేకపోయాడు.

ఊరంతా కొత్తగా, అసలు పరిచయం లేనట్లుగా అన్పించింది శ్రీనుకు.

"ఇది మా ఊరు కాదు" ఏడుపు గొంతుతో అన్నాడు.

" మీ ఊరే! సముద్రంలో ఉప్పెన వచ్చి ఇలా మారిపోయింది అంతే. అందుకే నువ్వు గుర్తు పట్టలేక పోతున్నావు".

ఊరు మధ్య గుండా నడుస్తూ పడమట దిక్కున ఊరికి కొంత దూరంలో ఉన్న పంచాయతీ పాఠశాల దగ్గరకు తీసుకెళ్ళింది. "ఆఁ ఇదే నా బడి.. అవును ఇది మా ఊరే" రామసీత చేయి విదుల్చుకొని లోపలికి పరిగెత్తాడు శ్రీను.

గదిలోపల బల్లదగ్గరకు వెళ్ళి "ఇదే నా సీటు" అంటూ తట్టి చూపించాడు బల్లను.

రామసీత లోపలకు వచ్చే లోపలే దిగి బయటకు పరిగెత్తి "ఇక్కడే మా అమ్మ నా కోసం అన్నం తెచ్చి కూర్చునేది".

"... ... ..."

అక్కడ తల్లి కూర్చున్నట్లే ఫీలయ్యాడు. "అమ్మా! అమ్మా!" అంటూ అక్కడే నిలబడి వెక్కివెక్కి ఏడ్చాడు. వాడి వేదన చూసి రామసీత కళ్ళు చెమ్మగిల్లాయి.

తల్లి కూర్చునే బండకు దగ్గరగా ఇసుకలో కూలబడ్డాడు శ్రీను.

వేదనతో వెక్కుతున్న వాణ్ణి జాలిగా చూసి పైకి లేపి చీర చెంగుతో వాడి ముఖం తుడిచింది రామసీత.

ఆమె వెంట నడుస్తోన్న శ్రీను కాలికి సగం ఇసుకలో కూరుకుపోయి ఉన్న చిన్న ప్లాస్టిక్ కవర్ తగిలింది. వంగి చేతిలోకి తీసుకున్నాడు.

" మా అమ్మ ఫోటో" అంటూ అరచినంత పని చేశాడు. 'ఎంత చక్కని రూపం' రామసీత తనలో తను అనుకుంది. శ్రీను తల్లి పోలికే. చొక్కాతో ఫోటోను శుభ్రం చేసి ముద్దుపెట్టుకుని జేబులో దాచుకున్నాడు. వాడి గొంతులో సన్నగా వేదన.

రామసీత, అమృత గురించి ఊళ్లో ఎవరినడిగినా సరైన సమాధానం లభించలేదు. శ్రీను తండ్రి వెంకటరమణ మాత్రం గుట్టలయిన శవాల మధ్యలో ఒకటిగా మిగిలి అగ్నికి ఆహుతి అయ్యాడు. ఆ విషయాన్ని పంచాయితీ ధ్రువీకరించింది.

కానీ అమృత........?

❖ ❖ ❖

పక్కన తడిమి చూసుకుంది. శ్రీను లేడు. పట్టుమని ఐదు సంవత్సరాలు కూడా నిండని కొడుకు.

అమృత హృదయం కీడును శంకించింది. అసలేం జరిగింది... కళ్ళు మూతలు పడుతున్నాయ్. మనసులో, శరీరంలో ఒకేసారి వణుకు ప్రారంభమవడం వల్ల తట్టుకోలేకపోతోంది.

శ్రీనును భర్త వేరుచేసి పడుకోపెట్టడం, అతడు తన పక్కన చేరడం, ఆ పారవశ్యం నుండి తేరుకునే లోపలే పెద్ద పెద్దగా కేకలు.. ఉధృతమైన వేగంతో వీస్తున్న గాలి.. ప్రపంచమంతా ప్రళయంతో తల్లడిల్లిపోతున్న భావన... దూరాన భీకరంగా గర్జిస్తున్న సముద్రం.. అక్కడ ఏదో అయిపోతున్నట్లు... ఏదో మీద విరుచుకు పడుతున్నట్లు...

ఆ చీకటిలో తను ఒంటరిదైన భావన... కాలు కింద పెట్టేసరికి నీళ్లు.

ఆ చీకటిలోనే శూన్యంలోకి చేతుల్ని ఆధారం కోసం విసిరి "శ్రీనూ... రమణా" అని కేకలు పెట్టింది. గొంతునాళాలు చిట్లిపోయేలా అరిచింది. విలవిలలాడింది.

కాళ్ళు గుంజినట్టై కుప్పకూలింది.

తరువాత ఏదో అలికిడి విని కళ్లు తెరిచింది అమృత.

తను పడుకున్న గదిలో రెండు పక్కలా ఉన్న మంచాలు, మంచాలపై మనుషుల్నీ గమనించిన తరువాత తనున్నది హాస్పటల్ అని అర్థమయిందామెకు. పక్కన వెంకటరమణ కనబడలేదు.

ఎదురుగా తెల్లకోటు, నుదుట పెద్దబొట్టు, ముఖాన చిరునవ్వు.... ఆ నవ్వు ఓదారుస్తున్నట్లుంది. "ఇప్పుడెలా ఉంది" అమృత నుదుటి మీద చేయి వేసి అడిగింది డాక్టరమ్మ.

"శ్రీను ఎక్కడ?" భయం భయంగా మంచం మీద నుంచి లేస్తూ అడిగింది అమృత.

"శ్రీనూనా...! అతడెవరు?"

"నా కొడుకు"

అమృత పెదాల చివరనుండి ఏడుపు తీగలుగా సాగింది.

ఆమె భుజం మీద చేయివేసి ఓదార్పుగా అంది డాక్టర్.

"ఉప్పెనలో కొట్టుకుపోతున్న నిన్నూ, మరికొంత మందిని ఇక్కడికి తీసుకొచ్చారు. వాళ్లలో పిల్లలెవరూ లేరు!"

ఆ మాటలు వినగానే కంపించిపోయింది అమృత. గుండెలవిసేలా రోదించింది. కాస్త తేరుకోగానే ఎదురుమొండి వచ్చింది. తమ ఊరును చూస్తుంటే గుండె తరుక్కుపోయింది ఆమెకు.

కళ్ళనిండా ఆశల్ని నింపుకొని ఊరంతా గాలించింది.

తను ఇంటి ఆనవాలే లేదు. తనకు సంబంధించిన వాళ్ల జాడా లేదు. అసలది ఊరులా లేదు. అంతా స్మశానంలా ఉంది.

గుట్టలు గుట్టలుగా శవాల దహనం సాగుతోంది.

పంచాయతీ ప్రెసిడెంటు రామలింగం మేడ, స్కూలు భవనం మినహా అన్నీ శిధిల అవశేషాలే.

కడదాకా ఉంటానన్నవాడు కడలి కాటుకు బలైపోయాడు.

పేగు తెంచుకున్న బంధం ప్రకృతిలో కలిసి పోయింది.

అమృత కళ్ళలో నీళ్లు ఇంకిపోయాయి.

" అమృత కదూ"! దగ్గరగా వస్తూ పలకరించాడు ప్రెసిడెంటు రామలింగం.

ఆయన పలకరింపుతో బావురుమంది అమృత.

రమణా, శ్రీనూ కన్పించడం లేదు బాబూ! " శ్రీను గురించి తెలియదు అమృతా! వెంకటరమణ మటుకు లేడు. అనాథ శవమై సామూహికంగా దహనమైపోయాడు" అమృతతో మాట్లాడుతుంటే రామలింగానికి ఏడుపు తన్నుకొచ్చింది.

తన దగ్గరే పడుకునే కొడుకును రమణ ఏనాడూ వేరు చేయలేదు. కానీ ఆవాళే... అయ్యో.. రమణ అలా వేరు చేయకపోతే బిడ్డ దక్కేవాడేమో, కనీసం చివరి క్షణంలోనైనా దగ్గరగా ఉండేదాన్నే. ఎవరో పిండేస్తున్నట్లు తల్లడిల్లుతున్న తల్లి మనసు.

బతికేందుకు కారణమే కన్పించడం లేదు. పక్కనే ఉన్న మర్రి చెట్టు నీడన కూలబడిపోయింది అమృత.

❖ ❖ ❖

" నాకు అమ్మ కావాలి" అదే పనిగా ఏడుస్తున్న శ్రీను మారాం.

దయగా జాలిగా చూసి వాణ్ణి దగ్గరకు తీసుకుంది రామసీత.

" అమ్మ వస్తుందిరా.. తప్పకుండా వస్తుంది" ఓపికగా సముదాయిస్తూ అంది.

"ఎప్పుడు?"

ఆ ప్రశ్నకు జవాబులేదు ఆమె దగ్గర. అనాథలుగా మిగిలిన ఇరవైమంది పిల్లలను బుజ్జగించడం ఓ ఎత్తు శ్రీను ఒక్కణ్ణి ఓదార్చడం ఓ ఎత్తు అవుతోంది రామసీతకు.

అక్కడ ఆట పాటలు, ఆహారం, ఓదార్పు మిగిలిన పిల్లల్లో తల్లిదండ్రులను మరపింపచేశాయి కానీ, శ్రీనూను మాత్రం మరిపించలేకపోయాయి.

"అమ్మ ఎప్పుడొస్తుంది?" వెక్కిళ్ళ మధ్య తడబడే మాటలతో అడిగాడు శ్రీను.

" తొందరలోనే వస్తుంది" అన్నంముద్ద నోట్లో పెడుతూ ఓదార్పుగా అంది రామసీత.

"…. …. … "

"మీ అమ్మను వెతికి తెమ్మని గోవిందును, రాజు భయ్యాను పంపించాను. నువ్వు గొడవ చేయకుండా మిగతా పిల్లలతో కలిసి ఆడుకో. నేను మీ అమ్మను తీసుకొస్తాను".

"నిజ్జంగా..." వాడి కళ్ళలో మెరుపు, మనసులో ఆశ ప్రస్ఫుటమవుతున్నాయి.

❖ ❖ ❖

వీధి లైటు వెలుతురు కిటికీగుండా అమృత ముఖంమీద పడుతోంది. ఆ

వెలుతురును తప్పించడానికి చేతిని కనురెప్పలకు అడ్డుగా పెట్టుకుంది.

ఎక్కడ ఎదురుమొండి, ఎక్కడ హైదరాబాద్. అక్కడ అందర్నీ కోల్పోయి, ఇక్కడ ఒంటరిగా ఈదుతున్న బతుకు. ఒక్క భానుమతి తప్ప ఎవరితోనూ దగ్గరితనం లేదు.

బహుశా ఇరువురు సర్వం కోల్పోయి ఒకే గూటి పడవలో ఉండడమనే దగ్గరితనం అయి ఉండొచ్చు అది.

అమృత ఇంటి పక్కనే ఉండేది భానుమతి. ఉప్పెనలో తనూ అందర్నీ కోల్పోయింది.

రోజూ కూలి పనికి వెళ్లడం, వారం వారం బట్వాడా తెచ్చుకోవడం, ఇదంతా ఎవరికోసం. ఎందుకోసమో అమృతకు అర్థం కావడం లేదు.

కూలి పని గుర్తుకు రాగానే రంగనాయకులు తెరపైకి వచ్చాడు. 'ఇంత అందం నేను మామూలు మనుషుల్లో చూడలేదు". కాంట్రాక్టర్ రంగనాయకులు ఆమె వైపు ఆరాధనగా చూస్తూ అన్నాడు.

"అంటే మీ ఉద్దేశం?" చీరచెంగుతో ముఖంతుడుచుకుంటూ పల్చగా నవ్వింది అమృత.

" నీ గురించి అంతా విన్నాను" బిస్లరీ వాటర్ తాగి, మూత బిగించి పక్కన పెడుతూ అన్నాడు రంగనాయకులు.

మధ్యాహ్నపు వేళ. అప్పటివరకు చేసిన ఫ్లై ఓవర్ బ్రిడ్జి కనస్ట్రక్షన్ పనులు ఆపి, అలసిపోయిన కూలీలు కాసింత తిని చెట్టు నీడన ఒదిగిపోయారు.

తిన్న గిన్నెల్ని పంపు దగ్గర కడుగుతూ అమృత రంగనాయకులు కేసి చూసింది.

" నీ భర్త అదృష్టవంతుడు. ఓ రకంగా దురదృష్టవంతుడు. అదృష్టం నీతో సహజీవనం....'

" కనుమరుగవడం నా దురదృష్టం" అమృత ముక్తసరిగా పలికింది.

భానుమతి వెంట హైదరాబాద్‌కి వచ్చి కూలీ పనికి కుదిరిన మొదట్లో రంగనాయకుల్ని చూసి భయపడింది అమృత. కానీ తోటి ఆడకూలీలందరూ అతణ్ణి మంచివాడుగానే చిత్రీకరించారు. స్త్రీలకు సంబంధించినంత వరకు అతడికి రాముడనే ముద్ర వేశారు.

'మరి ఈ పరీక్ష తనకేమిటి?'

"ఇంతవరకు కట్టుకున్నదాన్ని మినహా ఏ స్త్రీని ఇంత గాఢంగా ఇష్టపడలేదు" ఉద్వేగంతో చెప్పుకుపోతున్నాడు రంగనాయకులు.

మధ్యాహ్నపు సూర్య కిరణం అమృత కళ్లల్లో చురుక్కుమంది.

రంగనాయకులు కేసి తీక్షణంగా చూసింది. ఆ తీక్షణతని అతడు కొద్దిసేపు అనుభవించాడు. అమృత చూపు తిప్పుకుంది.

" నా కోరికలో కేవలం వాంఛ మాత్రమే ఉందనుకుంటే పొరపాటే. ఓ గొప్ప సౌందర్యం నా సొంతం అని అందరూ అనుకుంటుంటే నాకు తృప్తి. అడది ఒంటరిగా ఉంటే అందరూ అందుబాటులోదే అనుకుంటారు. ఓ మనిషికి దత్తతయినప్పుడు ఆ తీరు వేరు. చెప్పుకుపోతున్నాడు రంగనాయకులు అమృతకేసి ఆశగా, ఆరాధనగా చూస్తూ.

ఆ మటలు వినలేక ఆమె శరీరం కంపించింది. అతడి తీరు భరించలేక చకచకా అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

❖ ❖ ❖

ఆ రోజు శ్రీను సహాధ్యాయి శంకరం అమ్మా నాన్నలు వచ్చారన్న వార్త సమితి మొత్తం గుప్పుమంది. ప్రార్ధన చేస్తున్న పిల్లలందరూ అది ఆపేసి ఒక్కసారిగా బయటకు పరుగెత్తారు. 'నన్నొదిలి ఎక్కడికి పోయారమ్మ'! శంకరం తల్లిదండ్రుల్ని కావలించుకొని ఏడుస్తున్నాడు.

శ్రీనుకూ ఏడుపు వచ్చింది. తల్లి గుర్తుకొచ్చింది.

అరక్షణం కనిపించకపోతే శ్రీనూ అంటూ కలవరించే అమ్మ ఏదీ? ఎక్కడుంది?

శ్రీను కళ్ళు నీటి చెలమలయి బుగ్గల మీదుగా జారిపోయాయి.

రామసీత శ్రీను కళ్లు తుడిచి తన దగ్గరకు తీసుకుంది.

"అమ్మా నాన్న వచ్చారు. మిమ్మల్నొదిలి వెళ్ళాలంటే దిగులుగానే ఉందిరా శ్రీను. అయినా వెళ్లిపోతాను" ఒకింత గర్వంగా చూస్తూ అన్నాడు శంకరం. తట్టుకోలేక శంకరాన్ని కావలించుకున్నాడు శ్రీను.

" మా అమ్మ కూడా తప్పకుండా వస్తుంది. నేనూ వెళ్తాను" అమాయకంగా అన్న శ్రీను మాటల్లో నమ్మకం, గొంతులో దృఢ విశ్వాసం.

వాణ్ణి సముదాయించడం రోజురోజుకీ కష్టమవుతోంది రామసీతకు.

కరిగిపోయే కాలం తను చేసిన గాయాల్ని తనతోపాటు కరిగిస్తూ పోతుందని నమ్మకం రామసీతకు.

శ్రీను తల్లిని నెమ్మదిగా మర్చిపోతాడులే అనకునేదామె. కానీ అలా జరగడంలేదు. అతడు ఎప్పుడూ అమ్మకోసం కలవరిస్తాడు. తన అమ్మే ఈ లోకానికి అమ్మ అనేలా మాట్లాడతాడు. ప్రతిసారి అతడి ఆవేదన చూసి చలించిపోతుంది రామసీత.

అంత చిన్న వయసులోనే వాడిలో ఎంత ఎడ్మిరేషన్ అని అనుకునేదామె. ఒకరోజు.

"ఎవరైనా మంచి ఆడపిల్ల ఉంటే దత్తత తీసుకుందామనుకుంటున్నాం" అంటూ వచ్చిందొకావిడ. ఆవిడ పేరు జాహ్నవి.

"దానికేం మేడం! మీరు అడగాలేగాని కాదనడానికి ఏముంది!!" నవ్వుతూ అంది రామసీత.

రామకృష్ణ సేవా సదనంలోని అనాథలను పిల్లలు లేని దంపతులు తీసుకెళ్ళి పెంచుకోవడం పరిపాటి. ఆ సదనంలో పిల్లలను మంచి క్రమశిక్షణ, విద్యా బుద్ధులతో పెంచుతారని అందరి నమ్మకం. అందుకే ఆ సేవాసదనం నుండి బుద్ధిమంతులైన ఆడపిల్లలను దత్తత తీసుకోవాలని ఆమె ఆకాంక్ష.

"అక్కడున్న పిల్లల్ని చూసి ఈ పిల్లవాణ్ణి తీసుకెళ్ళి పెంచుకుంటే మీకు అభ్యంతరమా!" శ్రీనును చూపిస్తూ అంది జాహ్నవి.

"మరి మీరు ఆడపిల్ల కావాలన్నారు" అర్థంగాక ప్రశ్నించింది రామసీత.

"హి ఈజ్ సో క్యూట్ " అంది ముద్దుగా శ్రీనును దగ్గరకు తీసుకుంటూ.

"అయితే ఆ పిల్లాణ్ణే అడిగి చూడండి".

" మా యింటికి వెళ్దాం వస్తావా బాబూ? ఎప్పుడూ అక్కడే ఉండిపోవచ్చు నువ్వు" వాడి చుబుకాన్ని పట్టుకుని ప్రేమగా అడిగింది.

" మా అమ్మ వస్తుంది. నేను రాను"

"నేను మీ అమ్మలా లేనా"! బ్యాగ్‌లోని లిటిల్ హార్ట్స్ బిస్కెట్ ప్యాకెట్ తీసి శ్రీనుకిస్తూ అంది జాహ్నవి.

" మా అమ్మలా ఎవరూ ఉండరు"

" అంత బాగుంటుందా?"

"ఓ" ఎప్పుడూ తన జేబులోనే దాచుకునే ఆ ఫోటో చూపించాడు శ్రీను. ఆ ఫోటో నలిగిపోయి ఉంది. అయినా అందులోని మనిషి బాగానే కనబడుతోంది.

"నిజమే ఎంత బాగుందో" అనుకుంది జాహ్నవి. ఎంత నచ్చజెప్పడానికి ప్రయత్నించినా శ్రీను ఆమె వెంట వెళ్లనన్నాడు.

❖ ❖ ❖

"ఏమిటా ఆలోచన?" సిమెంట్‌ని కాంక్రీట్ మిక్చర్‌లో వేస్తూ అడిగింది భానుమతి.

"నా శ్రీను నాకు దొరుకుతాడంటావా భానూ!" హోస్‌పైప్‌తో నీళ్ళు పడుతూ

అంది అమృత.

"ఏమిటా పిచ్చి అమృతా! అంత పెద్ద ఉప్పెన తర్వాత చెట్టంత మనుషులే రాలిపోతే, ఇక పిల్లపిందెలెక్కడ మిగులుతాయి. గుండె దిటవు చేసుకొని శ్రీనును గుర్తుగానే మిగుల్చుకో" జాలి నిండిన స్వరంతో పలికింది భానుమతి.

పల్చటి వెన్నెల. ఓ చెట్టు నీడన భానుమతి, అమృత, వారికి కొంత దూరంలో అప్పటి వరకు పనిజేసి, అలసిపడుకున్న ఆడవాళ్ళు కొందరు.

"అవును గుండెను దిటవు చేసుకోవాలి! తనతో హైదరాబాద్ వచ్చిన భానుమతి ఆరు నెలల్లో అన్నీ మర్చిపోగలిగింది.

ఇప్పుడు, ఏమీ జరగని మామూలు మనిషి లాగే ఉంది".

కానీ తనే! ఆరు సంవత్సరాలు దాటుతున్నా.... భ్రమ కాని, అంత ఉప్పెన ముంచెత్తిన తర్వాత మనిషి బతికి బట్ట కట్టగలడా?

"అమ్మా! అమ్మా" అని అరిగిపోని గ్రామఫోన్ రికార్డులా శ్రీను పిలుపు. పనికి, చేతులకు కాళ్ళకు అడ్డం పడుతూ... తనకు విసుగు.. అయినా ఎంత మురిపెం.

"రంగనాయకుల్ని ఏం చేశావు? అమృతా!" ఉన్నట్టుండి అడిగింది భానుమతి.

"ఏం చేయడమేమిటి?" విసుగ్గా అంది అమృత.

"నేనిలా అంటున్నానని తప్పుగా అనుకోకు. వయసులో ఉన్న స్త్రీని చూసి లోకం వెంటపడుతుంది. అదీ మొగుణ్ణి పోగొట్టుకున్న నీలాంటి అందమైన ఆడదయితే మరీను. నీ వయసుకి, అందానికి, కాపలాగా ఓ తోడు అవసరమనుకుంటాను. అప్పుడే నీకంటూ ఒక రక్షణ..." చెప్పుకుపోతోంది భానుమతి.

అదోలా, ఆమె కళ్లలోకి సూటిగా చూసింది అమృత.

"అమృతా! ఈ కూలిపన్లు, ఈ కాయకష్టం నీవల్ల కాదు. సుఖంగా నీడపట్టున బతుకు వెళ్ళదీయవలసినదానవు. పెళ్ళాం పిల్లలు ఉన్నారన్న మాటేగాని రంగనాయకులు నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటాడు!".

"నా బతుక్కి అర్ధం కన్పించడం లేదు. అలాంటప్పుడు ఈ శరీరానికి రంగులు, మెరుపులు, పోషణ అవసరం అంటావా?" అంది అమృత.

❖ ❖ ❖

ఫోను రింగవుతున్న శబ్దం విన్పిస్తోంది. ఆఫీసులో ఎవరూ ఉన్నట్టు లేదు. ఫోన్ తీస్తున్న జాడ కన్పించడం లేదు.

చదువుతున్న పుస్తకాన్ని పక్కనపెట్టి లేచి పక్క గదిలోకి వెళ్లి అందుకొంది రామసీత.

"హలో! రామకృష్ణ సేవా సదనమా!"

"అవునండి! మీరెవరు!!"

"నేను జాహ్నవి విశ్వనాథం. కొద్ది రోజుల క్రితం ఆడపిల్లను దత్తత చేసుకుందామని వచ్చాను. మీ దగ్గరుండే శ్రీనుని చూసి మనసు మార్చుకున్నాను. పిల్లవాడు ఒప్పుకోలేదు!"

"ఓహో మీరా! మీకు ఏ విధంగాను సహాయపడలేక పోతున్నాం" రామసీత మాటలకు నవ్వింది జాహ్నవి.

"మీ సాయం గాదండి! నేనే మీకు సాయపడదామని ఫోన్ చేస్తున్నాను"

"థ్యాంక్యూ మేడమ్! మీ సాయాన్ని ఆహ్వానిస్తున్నాం. చెప్పండి"

'శ్రీను మదర్‌ని చూశాను"

"నిజంగా!.. ఎక్కడ, ఎలా"

"అడ్రసు రాసుకోండి..." అని అడ్రసు చెప్పింది జాహ్నవి.

❖ ❖ ❖

అద్దంలో కన్పిస్తూన్న ప్రతిబింబం తనదేనా అని విస్మయంగా చూసుకుంటూ కూర్చుండి పోయింది అమృత.

ఒంటికి నిగారింపు... మొహంలో మెరుపు, తను అసలు పాత అమృతేనా! రంగనాయకులు రంగప్రవేశం చేసిన తరువాత తన జాతకమే మారిపోయింది.

ఒకనాడు అమ్మడూ అంటూ చొరవ తీసుకొనే వాళ్ళకి ఇప్పుడు అమ్మగారు అయిపోయింది తను అనుకుని నవ్వుకుంది అమృత.

"భానుమతి గారటమ్మా! మిమ్మల్ని చూడాలని వచ్చారు. పంపించమంటారా?"

అద్దంలో ఖరీదైన ఆ ప్రతిబింబం తనదేనా? అని విస్మయంగా చూసుకుంటున్న అమృత పని మనిషి పిలుపుతో ఉలిక్కిపడింది.

లోపలికి పంపమని పని మనిషికి చెప్పిన అమృత తనే ఎదురెళ్ళి భానుమతిని సాదరంగా లోపలికి పిలిచింది.

"భానూ! నీకు కూడా అమ్మగారినేనా? నేను నీకెప్పుడూ పాత అమృతనే! మనసులో నాకు నేను ఉత్త అమృతనే!! రంగనాయకులు మనిషిని కాను"

స్థితి పరంగా ప్రస్తుతం ఎంతో ఎత్తులో ఉన్న అమృత తనతో ఇప్పటికీ అంతే

చనువుగా, సన్నిహితంగా ఉండటం భానుమతికి ఆనందం కలిగించింది. అదే సమయంలో ఎందుకో కొద్దిగా బాధగా కూడా అన్పించింది.

"నిజమే అమృతా! నీ కళ్లలో దిగులు నువ్వింకా పాత అమృతవనే చెప్తోంది. ఆ దిగులు.." భానుమతి మాటలు పూర్తి కాకుండానే.

"ఎవరో సేవాసదనం నుంచి మిమ్మల్ని చూడాలని వచ్చారమ్మా"! పని మనిషి మళ్లీ వచ్చి చెప్పింది.

"సేవా సదనం నుంచా?" తనలో తాను అనుకుంటూ ఆశ్చర్యపోయింది అమృత. భానుమతి వైపు ఎవరై ఉంటారంటావ్ అన్నట్టు చూసింది. ఏమో అన్నట్టు భానుమతి పెదవి విరిచి "చూద్దాం పద" అంటూ గదిలోంచి బయటకు నడిచింది.

ప్రధాన ద్వారం వద్ద ఓ పదకొండేళ్ళ పిల్లాడు. ఆ పిల్లాడి చేయి పట్టుకుని ఓ మహిళ నిలుచుని ఉన్నారు.

పిల్లాడు అటూ ఇటూ ఆశ్చర్యంగా కలియజూస్తున్నాడు. ఇంటి ఆవరణలో చక్కటి లాన్, పూలతోట, దారికి ఇరువైపులా క్రోటన్స్ పూల మొక్కలు. ఆవరణలో అక్కడక్కడా పళ్ళ చెట్లు - పెద్ద ఇల్లు అందమైన డిజైన్ చెక్కి ఉన్న పెద్ద ద్వారం - అన్నిటినీ కళ్ళప్పగించి చూస్తున్నాడు వాడు.

వాడు ఆ ఆశ్చర్యం నుంచి తేరుకోలేక పోతున్నాడు. "మా అమ్మ! ఇక్కడ ఉండటమేమిటి !" అనే ప్రశ్నకు ఆ చిన్ని మనసులో సమాధానం దొరకడం లేదు.

ఎండా, వెన్నెల లోపలికి తొంగి చేసే ఇల్లు.. పేడా, మట్టి కలిసిన వింత వాసన, ఎదురుగా హోరున ఎగిసిపడే సముద్రం అదీ తమ ఇల్లు. అందులో అమ్మ... మరి ఇదేమిటి.. ఇంత పెద్ద ఇల్లు... ఏవేవో తనెప్పుడూ చూడని వస్తువులు, పరిసరాలు..."

వాడి మనసు ఒప్పుకోవడం లేదు. "అమ్మ ఇక్కడుండదు. ఇదెవరిల్లో" అనుకుంటున్నాడు.

ఆ ఊహ మనసులో మెదలగానే వాడి ముఖం ముడుచుకుపోయింది. తన చేయిని పట్టుకున్న రామసీత చేతిలో వాడి చేయి అప్రయత్నంగా బిగుసుకుంది.

లోపలి గదిలోంచి హాల్లోకి వచ్చారు భానుమతి, అమృత.

అమృత అడుగు ముందుకు వెయ్యబోయి హఠాత్తుగా ఆగిపోయింది. ఆమె కళ్ళు విస్మయంతో పెద్దవయ్యాయి.

ఒక్క నిమిషం తలుపు దగ్గర ఉన్న పిల్లాడి మీద ఆమె చూపు స్థిరంగా

నిలిచిపోయింది.

"భానూ!" అంటూ భానుమతి చేతుల్ని గట్టిగా పిడికిలి బిగించి పట్టుకొంది అమృత.

"శ్రీను..నా కొడుకు శ్రీను.. భానుమతీ!" భానుమతీ పిలుపును, తననందుకో బోయిన భానుమతి చేతిని వినిపించుకోకుండా విదుల్చుకొని పరుగు తీసింది అమృత.

అప్పటికే శ్రీను ఊహలు ఎక్కడో తిరుగాడుతున్నాయి. అమ్మ అన్న ఆశతో వచ్చాడు. కానీ తమది కాని ఇంటి వాతావరణం వాడిని నిరాశలో ముంచేసింది.

నెమ్మదిగా తానే చొరవ తీసుకొని అడుగులు ముందుకు కదిపింది రామసీత.

"నమస్తే. నా పేరు రామసీత. రామకృష్ణ సేవాసదన్‌లో పని చేస్తుంటాను". అమృత ఆమె మాటలు విన్నది కానీ ప్రతి నమస్కారం చేయలేదు. ఆవిడ వైపు ఓసారి చూసి, మళ్లీ ఆమె పక్కనున్న పిల్లాణ్ణి చూస్తూండిపోయింది.

"మీ బాబు శ్రీను" అంటూ వాడి భుజం మీద చెయ్యేసి ముందుకు వెళ్లమన్నట్టు వాడికి సైగ చేసింది.

"శ్రీను... తల్లినే సర్వస్వం అనుకున్న శ్రీను.. అమ్మ కావాలంటూ ఇన్నేళ్ళుగా కలవరిస్తూనే ఉన్నాడు" అని ఇన్నాళ్ళుగా వాడు పడ్డ ఆవేదన, ఆరాటం, తపన.. ఒక్కొక్కటిగా వివరించి చెప్పింది రామసీత., ఆ మాటలు వింటుంటే అమృత గొంతు బొంగురుపోతోంది.

షెల్ఫ్‌కున్న అద్దంలో తన ప్రతిబింబం కన్పిస్తోంది అమృతకు! తన ఒంటి నునుపు.... ముఖంలో మెరుపు... రంగనాయకులు వంటి పరపతి గలిగిన మనిషితో సాంగత్యం.

ఇన్ని సంవత్సరాలుగా తన ఒంటరి బతుకులో సంభవించిన పెనుమార్పులు ఒక్కొక్కటీ.. అన్నీ కలిపి హృదయాన్ని ఒక్కసారిగా ఆక్రమించి అతలాకుతలం జేస్తున్నాయామెను.

ఎదురుగా చేతికందేంత దూరంలో కన్న కొడుకు. ఇన్నేళ్లుగా... ఇప్పటికీ తను ఎవరి కోసం అలమటిస్తోందో ఆ కన్నకొడుకు.

"బాబూ!" అంటూ ముందుకు దూకాలనుంది అమృతకు. కానీ అంతలోనే ఏదో అపరాధ భావన. వాణ్ణి తను దూరం చేసుకున్న భావన. వాడికి అమ్మను దూరం చేసిన భావన కట్టి పడేస్తోంది.

అక్కున జేర్చుకొని ఇన్నాళ్లుగా తనలో నిక్షిప్తమై ఉన్న మాతృత్వపు మమకారంతో ముంచెత్తాలనుంది ఆమెకు.

కానీ తను అప్పటి అమృత కాదు, ఇప్పుడు తన బాబుకు తెలిసిన తల్లికాదు....

మనసు మూగగా రోదిస్తోంది.

శ్రీను తల్లి వంకే చూస్తున్నాడు.

తెలిసినట్లే ఉంది. తన తల్లిలాగే ఉంది. కాని మనిషి ఇలా ఉందేమిటి? ఖరీదైన బట్టలు, నగలు, ఈ ఇల్లు...

అమ్మ ఇలా ఉండదే?! మారిపోయిందా? మారిపోవడమేమిటి? అసలు అమ్మ మారిపోతుందా? మారి పోగలుగుతుందా?

అమ్మే...అమ్మే....

ఉహు కాదు.. అచ్చం అమ్మలాగే ఉన్నట్టుంది. కానీ అమ్మ కాదు...కాదు.

తెలిసీ తెలియని వాడి పసిమనసులో ఎన్నో ప్రశ్నలు... సందేహాలు...సుడులు తిరుగుతున్నాయి.

'ఊహూ అమ్మలా లేదు... ముమ్మాటికీ అమ్మ కాదు' అనుకున్నాడు చివరగా.

"శ్రీనుని మీకు అప్పగించి పోవాలని వచ్చాను" రామసీత మాటలు ఇటు అమృతకు, అటు భానుమతికీ అమితానందం కల్గించాయి.

కానీ ఏదో దిగులు... మరేదో అధైర్యం. అమృతను పట్టి లాగేస్తున్నాయి. హరించుకు పోతున్న ధైర్యాన్ని గొంతులో ప్రోదిజేసుకొని పలికింది అమృత.

"మీరు అనుకున్న అమృత ఇక్కడ లేదు... బహుశా పొరబడి వచ్చి ఉంటారు".

వారించబోయింది భానుమతి. కానీ తన చేతుల చుట్టూ బిగుసుకున్న అమృత చేతులు భానుమతిని ఇక ముందుకు సాగనివ్వలేదు.

రామసీత అమృతను తేరిపార చూసింది ఆపాదమస్తకమూ.

"మీరు అమృత కాదా?" ఆమె స్వరంలో ఒకింత ఆశ్చర్యం.

"కాదు" దృఢంగా ఉంది అమృత స్వరం. "మీరు పొరబడ్డారు. నాకు అసలు పిల్లలే లేరు".

అమృత మాటలు రామసీతకు విచిత్రమన్పించాయి.

"మీరెందుకో కావాలని అలా...."

ఆమె మాటలకు అడ్డుపడుతూ "చూడండి, నాకూ కొడుకంటూ ఉండాలనే అనుకుంటున్నాను. కానీ నా కొడుకు కాని వాణ్ణి దగ్గరకు తీసుకోలేను. మీరు వెళ్లొచ్చు" అనేసి లోపలికి వెళ్లిపోయింది.

శ్రీనుకి ఆ మాటలు అర్థం కాక రామసీత వంక చూశాడు.

ఆమె శ్రీనును చూసి వాడి తల నిమిరి దగ్గరకు తీసుకుని లోపలికి వెళ్లిపోతున్న అమృతను చూస్తుండిపోయింది.

రెండు నిమిషాల తర్వాత శ్రీను వంక చూస్తూ " పద శ్రీను వెళ్లిపోదాం. నీకిక అమ్మ లేదు. మీ అమ్మ ఎప్పటికీ దొరకదు" అని వెనుదిరిగింది, వాడి చేయి పట్టుకుని.

శ్రీనూ హాలంతా ఒకసారి కలియచూశాడు. అక్కడే నిలుచుని ఉన్న భానుమతి వంక చూశాడు.

తర్వాత తలదించుకుని రామసీతను అనుసరించాడు.

"అమ్మ ఇక దొరకదా?" నడుస్తూ వాడు బిక్కమొహంతో, ఏడుపు స్వరంతో రామసీతను అడగడం లోపలి గదిలో ఉన్న అమృతకూ విన్పించింది.

'అమృత కళ్ళు నీటి చెలమలై పారుతున్నాయి.

'అవును అమ్మ పట్ల... అమ్మతనం పట్ల ఓ అద్భుతమైన సజీవ శిల్పాన్ని నిర్మించుకున్నాడు శ్రీను. కానీ ఆ శిల్పసౌందర్యం వెనుక దాగి ఉన్న ఈ నీలినీడల స్త్రీమూర్తి. తన వాస్తవిక అనుభూతులకు ఆలంబన కాదు అని గ్రహిస్తే... తట్టుకోగలడా!

ఆ ఊహలు, ఉద్దేశాలు మధురంగా, చిరంజీవిగా నిరంతరం వాడిలో ఉండిపోవాలి! ఈ వాస్తవిక పరిస్థితితో ఆకాశాన్నంటిన వాడి ఊహలహరివిల్లును చిన్నాభిన్నం చేయడం.. అమ్మపట్లవాడు కట్టుకున్న అనురాగసౌధాన్ని కూల్చేయడం ఇష్టంలేదు. చెప్పుకుపోతోందిఅమృత.

ఎంత దిటవు చేసుకుందామనుకున్నా ఆమె గుండె రోదనలు వినబడుతూనే ఉన్నాయి భానుమతికి.

జ్ఞాపకాల పథంలోకి పరుగు దీసింది అమృత మాతృహృదయం.

దూరాన గర్జిస్తున్న సముద్రం....అక్కడ ఏదో అయిపోయిన భావన... కాలు కింద పెట్టేసరికి సుడిలోకి లాగేస్తున్న నీళ్లు...చీకటి శూన్యంలో చేతుల్ని ఆధారం కోసం విసిరి...

శ్రీనూ అని కేక వేయడం...

ఆనాటి ఉప్పెన ఈనాటి అమృతలో!

దూరంగా రామసీత చీర కుచ్చెళ్లలో వెక్కుతూ నడుస్తున్న శీను, వాణ్ణి పొదివి పట్టుకుని అడుగులేస్తున్న రామసీత. నడుస్తున్నదల్లా ఆగిపోయి భుజంమీదుగా తల వెనక్కి తిప్పి చూసింది.

ఆ చూపులో లోపలి మనుషుల్ని చీరేసే ఎన్నో భావాలు, ప్రశ్నార్థకాలు! ✿

(విపుల మాసపత్రికలో ప్రచురితం)